ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

ఆదివారం 9 నవంబరు 2025

గైనకాలజిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మంథని సామాజిక ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న రెండు గైనకాలజిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలోగల మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో రూ.1.50 లక్షల వేతనంతో నియమించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని తెలిపారు. 8499061999, 9491481481 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రైల్వే బ్రిడ్జి పూర్తి చేసి సర్వీస్ రోడ్ నిర్మించాలి



రైల్వే గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి-కునారం రోడ్డులోని రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేసి సర్వీస్‌రోడ్డు పనులు చేపట్టాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ గేటు పడితే కాల్వశ్రీరాంపూర్ మార్గంలో వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. 9 ఏళ్ళ క్రితం కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అప్పటి ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా పనులు వేగవంతం కాలేదన్నారు. రైల్వే గేట్లు పడడంతో ఎమర్జెన్సీ అత్యవసర కేసుల విషయంలో అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనుల విషయంలో పట్టించుకోకపోవడం వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఆర్అండ్‌బి శాఖ సర్వీస్ రోడ్ల విషయంలో పట్టించుకోని కారణంగా రోడ్లపై గుంతలు, దుమ్ముధూళితో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శిలారపు పర్వతాలు తంగేడా రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, చిలివేరి సంపత్, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దారి మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో దారి మైసమ్మ, ఏల్పులమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనను శనివారం కాంగ్రెస్ నాయకులు మహంకాళిస్వామి, కాల్వ లింగస్వామి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని ఆటో అడ్డా వద్ద ఒజ్జల వెంకన్నశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి హోమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారుల తప్పిదంతో కూలగొట్టారని, అధికారుల తప్పిదంపై చర్యలు ఉంటాయన్నారు. ప్రతి డివిజన్‌లో 2గుంటల భూమిలో పోచమ్మ, మైసమ్మ, ఏల్లమ్మ గుళ్ల నిర్మాణం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సొంత డబ్బులతో నిర్మిస్తున్నారని, ఎక్కడైతే కూలగొట్టారో అక్కడ నిర్మాణాన్ని పునః ప్రారంభించనున్నట్టు చెప్పారు. కొందరు నాయకులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజల నిర్ణయం మేరకే జరుగుతాయని తెలిపారు. నాయకులు తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, పెద్దెల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, గట్ల రమేష్, గడ్డం శ్రీనివాస్, ఎండీ ముస్తాఫా, దాసరి ఉమాదేవి, ఆడెపు దశరథం, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, పాల్గొన్నారు.

పునర్ నిర్మాణాలు ప్రారంభం



కోల్‌సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో కూల్చివేసిన మైసమ్మ గుళ్ల పునర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కార్పొరేషన్ సిబ్బంది అత్యుత్సాహంతో వివిధ కూడళ్లలో ఆటో డ్రైవర్లు, భక్తులు కొలిచే మైసమ్మ గుళ్లను కూల్చివేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచనలతో కాంగ్రెస్ నాయకులు మళ్లీ పునర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. శనివారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోని ఆటో స్టాండ్, గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పునర్ నిర్మించారు. మరికొన్ని చోట్ల కాంగ్రెస్ శ్రేణులు పునర్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్యాక్స్ చైర్మన్

ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని నందిమేడారం సింగిల్ విండో చైర్మెన్ ముత్యాల బలరాం రెడ్డి అన్నారు. శనివారం పెర్కపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోద్దని, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని సూచించారు. డైరెక్టర్లు దీటి శ్రీనివాస్, భారత స్వామి, సాయిరి కుమర్, మోర కొమురయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మెన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, దేవి రమణ, పాల్గొన్నారు.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ముఖ ద్వారం

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో హెచ్‌టీఆర్ వైఫల్యంపై

కేంద్రం సీరియస్

- విచారణ జరిపిన ఉన్నత స్థాయి కమిటీ
- హల్దర్ టాప్సే మరమ్మతు చేయాలని నివేదిక
- డెన్మార్క్ హై కమిషనర్‌తో మాట్లాడిన ఎరువుల శాఖ కార్యదర్శి
- మరమ్మతులకు హల్దర్ టాప్స్ సానుకూలత

కోల్‌సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో కీలకమైన హెచ్‌టీఆర్ వైఫల్యంపై కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. కేంద్రం రూ.6వేల కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ పరిశ్రమలో టెక్నాలజీ వైఫల్యంతో ఈ ఏడాది సుమారు 4నెలల పాటు ఉత్పత్తి నిలిచిపోయింది. గత నెలలో దీనిపై విచారణకు కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ దేశంలోని వివిధ ఎరువుల కంపెనీ లకు చెందిన యాజమాన్యాలతో ఉన్నత స్థాయి కమిటీ వేసింది. హిందుస్థాన్ ఊర్వక్ అండ్ రసాయన లిమిటెడ్(హెచ్‌యూఆర్ఎల్) సీఎండీ ఎస్‌పీ మహంతి, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ సీఎండీ ముదుగోర్కర్, ఆర్ఎఫ్‌సీఎల్ సీఈఓ మనోహరన్, మద్రాస్ ఫెర్టిలైజర్స్ సీఎండీ ఎంకే జైన్, ఆర్‌సీఎఫ్ డీటీరియా గోస్వామిలతో కూడిన ఉన్నత స్థాయి బృందం గత నెలలో కంపెనీని సందర్శించి విచారణ జరిపింది. కంపెనీలో హెచ్‌టీఆర్ వైఫల్యంతో ఏర్పడిన ఇబ్బందులు, తదుపరి చర్యల గురించి ఆరా తీసింది. హల్దర్స్ టాప్స్, ఎల్అండ్‌టీకి చెందిన నిపుణులతోనూ చర్చించింది. అనంతరం కేంద్ర, ఎరువుల రసాయనాల మంత్రిత్వశాఖకు నివేదిక ఇచ్చింది. ఈ నివేదికలో ఆర్ఎఫ్‌సీఎల్ ఒక కీలకమైన హైటెంపరేచర్ రిఫార్మర్(హెచ్‌టీఆర్) వైఫల్యానికి డెన్మార్క్‌కు చెందిన హల్దర్ టాప్స్ సంస్థదే బాధ్యత అని, ఆ సంస్థనే మమ్మతులు చేయించాలని పేర్కొన్నది. దీంతో కేంద్రం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. డెన్మార్క్ హై కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. హల్దర్ టాప్స్ సంస్థ ఇచ్చిన టెక్నాలజీ, యంత్రాల వైఫల్యంతో ఆర్ఎఫ్‌సీఎల్‌కు సుమారు రూ.400కోట్ల నష్టం జరి గిందని, ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో రైతాంగానికి యూరియా సరఫరా చేయడం లో ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్నది. హల్దర్‌టాప్స్ సంస్థనే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నది. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే హల్దర్ టాప్స్‌పై దేశంలో బ్లాక్ లిస్టు ఉంటుందని పేర్కొన్నట్టు సమాచారం.

రామగుండంలోనే టెక్నాలజీ సమస్యలు...

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మిగతా 8లో

హెచ్‌టీఆర్ లేకుండానే యూరియా ఉత్పత్తి...

ఆర్ఎఫ్‌సీఎల్‌లో హెచ్‌టీఆర్ ఫెల్యూవర్‌తో హెచ్‌టీఆర్‌కు సంబంధం లేకుండానే ప్రైమరీ రిఫార్మర్ ద్వారా యూరియా ఉత్పత్తి చేస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో రోజుకు 3850టన్నుల యూరియా ఉత్పత్తి జరుగాల్సి ఉండగా 3500 టన్నుల యూరియాను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. గత నెలలో 1.13లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరుగగా తెలంగాణకు 45వేల టన్నుల యూరియా అందించారు. ఈ నెలలో ఇప్పటి వరకు తెలంగాణకు 9వేల టన్నులకు పైగా యూరియా రవాణా జరిగింది. ప్లాంట్ ఎలాంటి సాంకేతిక అవరోధాలు లేకుండా నడిస్తే తెలంగాణకు యూరియా తిప్పలు ఉండవు. హెచ్‌టీఆర్ మరమ్మతులు చేసి బిగిస్తే రోజుకు 4వేల టన్నుల వరకు యూరియా ఉత్పత్తికి అవకాశం ఉంటుంది.

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే మళ్లీ వేయాల్సిందే...

- రామగుండం కార్పొరేషన్‌లో కఠిన వైఖరి
- రంగంలోకి విజిలెన్స్



పద్మావతికాలనీలో మళ్లీ వేస్తున్న రోడ్డు

కోల్‌సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నాణ్యత విషయంలో ఉన్నతాధికారులు కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఇటీవల టీయూఎఫ్ఐడీసీ, పట్టణ ప్రగతి పనుల్లో నాణ్యత లేకపోతే మళ్లీ పనులు చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తున్నారు. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులపై కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారికి, కమిషనర్‌కు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు పలు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదులతో విచారణ జరిపించారు. పద్మావతికాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందనే విషయమై యంత్రాంగం సీరియస్‌గా స్పందించింది. కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో నదరు కాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు నిర్మించాడు. ఇదే విధంగా రెండు మూడు రోడ్లపై ఫిర్యాదులు రాగా ఆర్అండ్‌బీతో నాణ్యత పరీక్షలు చేయించారు. కాంట్రాక్టర్లే సొంత ఖర్చులో రోడ్డు నిర్మాణం జరుపాలని ఆదేశించినట్టు తెలుస్తుంది. ఈ చర్యలతో కార్పొరేషన్ కాంట్రాక్టర్లలో ఆందోళన వ్యక్తమవుతుంది. మరో వైపు కొందరు ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారంటూ ఫిర్యాదుల నేపథ్యంలో అధికార యంత్రాంగమే విజిలెన్స్ దృష్టికి తీసుకెళ్ళినట్టు సమాచారం. ఈ మేరకు విజిలెన్స్ విభాగం కూడా రంగంలోకి దిగినట్టు తెలుస్తుంది.

సుల్తానాబాద్‌లో కోతుల పట్టివేత ప్రారంభం



సుల్తానాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను పట్టుకోవడానికి మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇటీవల కోతుల దాడుల మూలంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పలువురు గాయపడ్డారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టారు. కోతులను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు తిరుపతి నుంచి ఇక్కడికి రప్పించారు. రెండు రోజులుగా కోతులు ఎక్కడెక్కడ సంచరిస్తున్నాయి, వాటి నివాస ప్రాంతాలను గమనించారు. శనివారం నుంచి కోతులను పట్టుకునే పని ప్రారంభించారు. కోతులకు మత్తుతో కలిపిన పల్లీలు, ఆహారాన్ని అందించి అవి సులువుగా బోనులో బంధించే ఏర్పాట్లు చేశారు. తర్వాత వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు.

కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శనివారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కమిటీల పేరు మీద కాలయాపన చేయవద్దని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన తరువాత కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం కృషి చేస్తున్నప్పటికీ కొన్ని కార్మిక సంఘాలు గనులపై అసత్య ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, అలవెన్స్‌లపై విధిస్తున్న ఇన్‌కం టాక్స్‌ను కోలిండియాలో మాదిరిగా యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంతో చర్చించకుండా 150 మస్టర్ల సర్క్యులర్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎం లలిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, ఆకునూరి శంకరయ్య, దొంత సాయన్న, ఎం చక్రపాణి, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, సయ్యద్ సోహేల్, చెప్యాల భాస్కర్, ఎంఏ గౌస్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అప్పన్నపేట విద్యార్థులు



పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 17 విభాగంలో ఇద్దరు బాలికలు, ఒక బాలుడు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ పాఠశాల పీడీ వేల్పుల సురేందర్ తెలిపారు. పీడీ మాట్లాడుతూ మహబూబ్ నగర్‌లో ఈనెల 7 నుంచి 9 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైనా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు అభినందించారు.

పుష్కరకాలం తర్వాత స్వగ్రామానికి...

- మతిస్థిమితం సరిగా లేక వెళ్లిన వ్యక్తి
- మాజీ సర్పంచ్ చొరవతో తల్లి చెంతకు



తల్లితో కుమారుడు వెంకటరాములు

పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక ఇంటిని, ఊరును, కన్నవారిని వదిలివెళ్లిన వ్యక్తి 12 సంవత్సరాల అనంతరం స్వగ్రామానికి చేరుకున్నాడు. పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన పట్టెం వెంటకరాములు 25 ఏళ్ల వయసులో మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గ్రామాన్ని విడిచి వెళ్లిపోయాడు. తల్లితోపాటు బంధువులు, గ్రామస్థులు వెంకటరాములు కోసం తీవ్రంగా వెతికినా ఫలితం లేకుండా పోయింది. అతను అస్సాం రాష్ట్రంలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ సహకారంతో తీసుకుని వచ్చారు. 12 ఏళ్ల అనంతరం శనివారం స్వగ్రామానికి చేరుకున్నాడు.

వివరాల్లోకి వెళితే అస్సాం రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో హోటల్ పనిచేశాడు. ఆ సమయంలో అతనికి కరీంనగర్, పెద్దపల్లి ప్రాంతాలకు చెందిన వారు పరిచయమయ్యారు. కొన్ని రోజుల తరువాత తిరిగి అతను అస్సాంలోని సొంత గ్రామానికి వెళ్లి హోటల్ పెట్టుకున్నాడు. హోటల్ ఎదుట కనిపించిన వెంకటరాములును పిలిచి అడుగగా కరీంనగర్, రంగాపూర్, రాఘవపూర్ అంటూ పలు రకాల ఊరి పేర్లను తెలిపాడు. అస్సాంకి చెందిన వ్యక్తి అతడి ఫొటోను కరీంనగర్‌కు చెందిన వ్యక్తులకు వాట్సాప్ ద్వారా షేర్ చేశాడు. దీంతో పెద్దపల్లి ప్రాంతానికి చెందిన కొందరు సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోను చూసి రంగాపూర్ గ్రామస్థుడిగా గుర్తుపట్టారు. అస్సాంకు చెందిన వ్యక్తి ఫోన్ నంబర్ తీసుకొని వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తల్లి రుక్కమ్మతో మాట్లాడించారు. అక్కడ ఉన్నది తమ కుమారుడేనని నిర్ధారించుకుని, తీసుకురావాలని మాజీ సర్పంచ్ గంట లావణ్యా-రమేష్‌కు కోరారు. మాజీ సర్పంచ్ ఆర్థికసాయం అందించి అస్సాం రాష్ట్రంలోని లాఖీంపూర్ జిల్లా భోగినాడులో ఉన్న వెంకటరాములు వద్దకు అతని బంధువులు ప్రసాద్, మహేష్‌లను వారం క్రితం వెళ్లగా శనివారం వెంకటరాములును తీసుకొచ్చారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన తరవాత అతను దేశంలో వివిధ ప్రాంతలలో తిరుగుతూ చివరకు అస్సాం రాష్ట్రం చేరుకున్నాడు. కుమారుడిని చూసి తల్లి ఆనందం వ్యక్తం చేసింది.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- కార్తీకమాసంతో పెరిగిన డిమాండ్

మంథని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో కూరగాయల సాగు కోలు కోలేని విధంగా దెబ్బతింది. దీంతో మార్కెట్‌లో కూరగాయల రేట్లు భగ్గుమంటున్నాయి. కార్తీకమాసం ఎఫెక్టుతో కూరగాయల వాడకం పెరగడంతో రేట్లు మరింతగా పెరిగాయి. వినియోగదారులపై అధిక భారం పడుతుండడంతో మార్కెట్ వైపు వెళ్ళేందుకు జనం జంకుతున్నారు. అధిక ధరలతో ప్రజలు అరకొరగా కొనుగోలు చేస్తున్నారు.

టమాట, పచ్చిమిర్చి పాలకూర, చుక్కకూర, బీరకాయ, క్యారెట్, మునగకాయలు.. ఇలా కూరగాయాల ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కొనుగోలు చేయకముందే ధరల మంటతో మార్కెట్ వైపు చూసేందుకే వినియోగదారులు జంకుతున్నారు. పక్షం రోజులుగా మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మార్కెట్‌లో కిలో బీరకాయ-100, టమాట- 40, మిర్చి-45, కాకర కాయ-60, చిక్కుడుకాయ-120, బెండకాయ-60, దొండ కాయ-50, వంకాయ-40, క్యాబేజీ-40, కాలీఫ్లవర్-70, మున కాయ -140, సోర కాయ-40, అలసంద- 50, గోరుచిక్కుడు- 45, పాలకూర, చుక్క కూర, తోటకూర ఒక్క కట్టను రూ. 20 చొప్పున రిటైల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. అకాల వర్షాలకు తోటల్లో ఉన్న పంట దెబ్బతినడం తో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేస్తుండటంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మరో వైపు కోతుల దాడుల కారణంగా చాలా వరకు గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును తగ్గించారు. మరో వైపు పొద్దంతా కష్టపడినా పెరిగిన ధరల కారణంగా కూలీ గిట్టుబాటు కావడం లేదని కొందరు రిటేల్ వ్యాపారులు వాపోతున్నారు. పెరిగిన కూరగాయల ధరలు ఈ పరిస్థితికి దారి తీసింది. మరి కొద్ది రోజులు మార్కెట్‌లో కూరగాయల ధరల పరిస్థితి ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. స్థానికంగా పండే కూరగాయలు చేతికి వస్తే ధరలు తగ్గే అవకాశం లేదంటున్నారు. దీంతో సదరు వినియోగదారులు మార్కెట్ వైపు కన్నెతి చూడటానికే జంకే పరిస్థితి నెలకొంది.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



పాఠశాలలో మాట్లాడుతున్న ఏఎస్ఐ రత్నాకర్

ఓదెల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏఎస్ఐ రత్నాకర్ కోరారు. కస్తూర్బాగాంధీ బాలికల హైస్కూల్‌లో శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా పాఠశాలల్లోనే ఉండాలని కోరారు. విద్యార్థులను ఇండల్లోకి పంపించే ముందు తల్లిదండ్రుల నుంచి రాయించుకున్న తర్వాతనే పంపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సెల్‌ఫోన్లు పక్కనపెట్టి విద్య పైనే ఏకాగ్రత ఉంచాలని కోరారు. అవగాహన ఉంటేనే సెల్ ఫోన్‌లో లింకులు ఓపెన్ చేయాలని, ఒకవేళ ఓపెన్ చేసినట్లయితే సైబర్ క్రైమ్‌కు గురవుతారని తెలిపారు. ప్రతి విద్యార్థి జాగ్రత్తగా, పాఠశాలలో హాస్టల్‌లో వ్యవహరించాలని సూచించారు.

ఎల్ఎండీ గేట్లు మూసివేత

తిమ్మాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్లను శనివారం మూసివేశారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.775 టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగునుంచి 1581క్యూసెక్కులు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తుండగా మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 254క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతోంది.

వందేమాతరం సర్టిఫికెట్ అందుకున్న ఉపాధ్యాయుడు



ఆదిరెడ్డి

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఏనుగు ఆదిరెడ్డి అనే ఉపాధ్యాయుడు వందేమాతరం గేయం 150 సంవత్సరాలు నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆన్‌లైన్‌లో వందేమాతరం గేయంపాడి ఢిల్లీకి పంపారు. ఉపాధ్యాయుడి ప్రతిభకు సంతృప్తి చెందిన ఢిల్లీ సాంస్కృతిక కార్యాలయం వారు శనివారం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్‌ను పంపగా ఆదిరెడ్డి అందుకున్నారు.

స్కూటీలో నాగుపాము

హుజూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన స్కూటీలో నాగుపాము పిల్ల ప్రత్యక్షమైంది. హుజూరాబాద్ పట్టణానికి చెందిన షౌకత్ తన స్కూటీని హనుమాన్ దేవాలయ సమీపంలో పార్కింగ్ చేశాడు. స్కూటీలో పాము కనిపించడంతో స్థానికులు యజమానికి సమాచారం అందించారు. వెంటనే షౌకత్ స్కూటీవద్దకు వచ్చి స్పేర్ పార్ట్‌తీసి చూడగా పెట్రోల్ ట్యాంక్ కింద ఉండడం గమనించాడు. పామును స్కూటీలోనుంచి తీసి ఊరి చివర వదిలేశారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థుల ధర్నా

● సెక్యూరిటీ సీఎస్‌వో సస్పెన్షన్

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో శుక్రవారం అర్ధరాత్రి కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. సీఎస్‌వో(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్)రాజిరెడ్డి మద్యం సేవించి వచ్చి దూషిస్తున్నాడని విద్యార్థులు ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. అనంతరం సీఎస్‌వోను విద్యార్థులు బంధించారు. సమాచారం అందుకున్న వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ శుక్రవారం అర్ధరాత్రి ఘటన స్థలానికి చేరుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా ఆగ్రహించిన విద్యార్థులు సీఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. దీంతో సీఎస్‌వోపై చర్యలు తీసుకుంటామని వైస్ ప్రిన్సిపాల్ హామీ ఇవ్వటంతో విద్యార్థులు ధర్నాను విరమించారు. శనివారం విచారణ చేసిన వైస్‌ప్రిన్సిపాల్ సీఎస్‌వో రాజిరెడ్డిపై నివేదికను ప్రిన్సిపాల్ జి నరసింహకు అందించారు. దీంతో ప్రిన్సిపాల్ సీఎస్‌వోను సస్పెండ్ చేసినట్లు శనివారం రాత్రి వైస్ ప్రిన్సిపాల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.





విదేశీ పండ్ల సాగు భళా

దేశ, విదేశీ పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి

వినూత్న ప్రయోగాలు చేస్తున్న ఆదర్శ రైతులు

మంథని, రామగిరి మండలాల్లో కాతకు వచ్చిన పండ్లు

మంథని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చైనాకు చెందిన డ్రాగన్‌ఫ్రూట్.. తైవాన్‌జామ.. మల్లేషియన్, కాశ్మీర్ ఆపిల్, రష్యా ప్యాక్షన్‌ఫ్రూట్, నూనీ ఫ్రూట్.. ఇలా అనేక దేశ,విదేశీ పండ్లను సాగు చేస్తున్నారు ఇక్కడి రైతులు. విదేశీ పండ్లను గతంలో దిగుమతి చేసుకొని మహా నగరాల్లో విక్రయించేవారు. వాటిని స్థానికంగా సాగు చేస్తున్నారు రైతులు. దేశ,విదేశీ పండ్లను సాగు చేస్తున్న రైతులపై ఆంధ్రజ్యోతి స్పెషల్ స్టోరీ.

మంథని పట్టణ శివారులోని బన్నె చెరువు సమీపంలో పెద్దపల్లి రంజిత్ అనే యువకుడు ఏడాన్నర క్రితం రంజిత్ రెండు ఎకరా ల్లో డ్రాగన్ మొక్కలను ట్రెల్లిస్ సిస్టంలో సాగు చేశారు. ప్రస్తుతం నెలకు రెండు సార్లు డ్రాగన్ పండ్లను తెంపుతూ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పూత, మొగ్గ, కాయ దశకు రావటానికి 45 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ప్రతి నెల రెండు సార్లు కాతకు వస్తుండటంతో డ్రాగన్ ఫ్రూట్ ను కట్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక పండ్ల మార్కెట్‌లో వ్యాపారుల ఇక్కడి డ్రాగన్ ఫ్రూట్స్‌ను విక్రయిస్తున్నారు. డ్రాగన్ తోపాటు తైవాన్ జామా, బొప్పాయి, హైబ్రిడ్ కొబ్బరి మొక్కలను, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక ఫెన్సింగ్, డ్రిప్ సిస్టం ఏర్పాట్లు చేశారు. కూరగాయలను సైతం పండిస్తున్నారు.

రామగిరి మండలంలోని సుందిళ్ళ గ్రామానికి చెందిన అల్లువెల్లి రాజిరెడ్డి 12 గుంటల్లో దేశ, విదేశాల్లోని పండ్ల మొక్కలను పెంచుతున్నారు. దాదాపు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి రెండున్నర ఏళ్ళుగా విభిన్న పండ్ల మొక్కలను సాగు చేస్తున్నారు. వివిధ రకాల మొక్కలను ఏపీలోని కడియం నర్సరీ నుంచి తెచ్చి ఇక్కడ పెంచుతున్నారు. కాశ్మీర్ ఆపిల్, 99 రకాలు, సీతా ఫలం, రామఫలం, లక్ష్మణ ఫలం, హనుమాన్ ఫలం, ఆపిల్ బేర్, అవకాడ, డ్రాగన్‌ఫ్రూట్ (రెడ్, వైట్ రకాలు), ప్యాషన్ ఫ్రూట్, కీవీ, వాకాయ లాంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వీటిలో కొన్ని కాతకు వచ్చి వచ్చాయి. ఇదే గ్రామానికి చెందిన మంగళ భగవత్‌రెడ్డి సైతం పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

కల్వచర్ల గ్రామానికి చెందిన రాపెల్లి రమేష్ రెండు ఎకరాల్లో మహాగనీ మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్, పెంచుతున్నారు. నాలుగేళ్ళుగా వీటిని సాగు చేస్తున్నారు. తేలికపాటి, ఎన్ని ఏళ్ళు నీటిలో నానీనా చెడి పోని మహాగని 5 వందల మొక్కలను పెంచుతున్నారు. వీటిని స్టీమర్స్, సంగీత వాయిద్యాల, తలుపులు లాంటి వాటి తయారీకి ఉపయోగిస్తారు. ఇదే గ్రామానికి చెందిన వేముల వెంకటేష్ సైతం డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచడంతోపాటు షిప్, గోట్ ఫామింగ్ చేస్తున్నారు.



ఫార్మింగ్ అంటే చాలా ఇష్టం

పెద్దపల్లి రంజిత్, మంథని



ఎంబీఏ పూర్తి చేశారు. కొంత కాలం డిజిటల్ మార్కెటింగ్‌లో పని చేశా. ఫార్మింగ్ అంటే ఇష్టంతో మంథనికి వచ్చాను. ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేయటానికి శ్రీకారం చుట్టాను. రెండేళ్ల క్రితం చైనా డ్రాగన్, తైవాన్ జామ, హైబ్రిడ్ కొబ్బరి, బొప్పాయి లాంటి వాణిజ్య పంటల సాగు తోపాటు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశా. ప్రస్తుతం డ్రాగన్‌ఫ్రూట్స్ దిగుబడి వస్తోంది. లోకల్ వ్యాపారులకు విక్రయిస్తున్నా. ఆదాయం కూడా బాగానే వస్తుంది. జామ, కొబ్బరి, బొప్పాయి కాతకు వచ్చాయి.

యూట్యూబ్‌లో చూసి విదేశీ పండ్ల మొక్కల సాగు

అల్లువెల్లి రాజిరెడ్డి, సుందిళ్ళ, రామగిరి మండలం



యూట్యూబ్‌లో కొత్త రకం, విదేశీ పండ్ల మొక్కల సాగు వీడియోలను చూసి ఆసక్తితో పలు రకాల విదేశీ, దేశీయ పండ్ల మొక్కలను సాగు చేస్తున్నా. దాదాపు 12 గుంటల స్థలంలో రెండున్నర ఏళ్ళుగా వివిధ రకాల విదేశీ పండ్ల మొక్కలను సాగు చేస్తున్నా. వాటిలో కొన్ని ఇప్పటికే కాతకు వచ్చాయి. ఇక్కడి వాతావరణం అనుకూలించక కొన్ని మొక్కలు ఎండి పోయాయి. మరి కొన్ని విదేశీ మొక్కలను పెంచడటానికి కృషి చేస్తున్నా.

మయన్మార్ సైబర్ నేరగాళ్ల నుంచి ముగ్గురికి విముక్తి

● స్వగ్రామం చేరుకున్న రాయికల్, ధర్మపురికి చెందిన యువకులు



మోసారపు రాజు



గణేష్ చంద్ర

రాయికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ దేశంలోని సైబర్‌నేరగాళ్ల శిబిరాల్లో చిక్కుకున్న రాయికల్ పట్టణానికి చెందిన ఇద్దరుయువకులు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో మోసారపు రాజు, గణేష్ చంద్ర భారత్‌కు చేరినట్లు ఉటుంబ సభ్యులు తెలిపారు. రాయికల్‌కు చెందిన మోసారపు రాజు నాలుగు నెలల క్రితం మయన్మార్ వెళ్లాడు. మొదట పనిబాగానే ఉందని తెలిపినా, కొద్ది రోజులకే అక్కడ చిత్రహింసలు పెడుతున్నారని, రూ.4లక్షలు ఇస్తే మాత్రమే భారత్‌కు పంపిస్తామంటున్నారని తన భార్య నవ్యశ్రీకి ఫోన్‌లో తెలిపాడు. ఆ తర్వాత నుంచి ఆయనతో కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. అలాగే రాయికల్ పట్టణంలోని భరతమాత కూడలి ప్రాంతానికి చెందిన గణేష్ చంద్ర కూడా ఉద్యోగం వస్తుందని నమ్మి మయన్మార్ వెళ్లాడు. అక్కడ సైబర్ నేరగాళ్ల శిబిరాల్లో బలవంతంగా పని చేయించినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ జోక్యంతో ఆ దేశంలోని బాధిత భారతీయులను రక్షించి ఆయా రాష్ట్రాలకు అప్పగించారు. మయన్మార్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న రాయికల్‌వాసులు ఇద్దరు చివరకు స్వదేశానికి చేరుకున్నారు.

స్వగ్రామం చేరిన ధర్మపురి యువకుడు

ధర్మపురి : మయన్మార్ సైబర్ నేరగాళ్లచేతిలో ధర్మపురికి చెందిన యువకుడు ఉన్నాడు. ధర్మపురికి చెందిన శ్యామ్‌రావు అరుణ్ గతంలో బెహ రాన్ దేశం వెళ్లి తిరిగి వచ్చాడు. ఒక మిత్రుని సహాయంతో పది నెలల క్రితం మయన్మార్ దేశం వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి మూడుసార్లు ఫోన్‌చేసి వస్తానని చెప్పాడు. నాలుగు నెలల క్రితం ఒకసారి ఇంటికి ఫోన్ చేశాడు. పాస్‌పోర్టు లాక్కొని అక్కడే ఒకరి వద్ద పెట్టుకు న్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులకు ముగ్గురు కొడుకులు కాగా, అరుణ్ పెద్ద కుమారుడు. ఈ యవకుడు సైతం కేంద్ర ప్రభుత్వ సహాయంతో స్వదేశానికి తిరిగి వచ్చినట్లు సమాచారం.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ నుంచి కోరుట్ల పట్టణానికి గంజాయి సరపరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. పక్క సమాచారంతో కోరుట్ల పట్టణ శివారులోని అయిలాపూర్ రోడ్డులో వాహనాల తనిఖీని నిర్వహించారు. అయిలాపూర్ నుంచి కోరుట్ల వైపు వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని పరిశీలించగా వాహనంలో 100గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తి అయిలాపూర్ గ్రామానికి చెందిన నల్ల విశాల్‌గా గుర్తించారు. కాగా అతనితో ఉన్న మరో వ్యక్తి పరారీ అయ్యాడు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇద్దరు వీఆర్‌ఏలతో కలిసి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



దేవయ్య(ఫైల్)

బోయినపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి వేగంగా బైక్‌పై వచ్చి ఆటోను ఢీకొట్టడంతో ఆటోబోల్తా పడిన సంఘ టనలో ఒకరు మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలు, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బోయినపల్లి మండలం కొదురుపాక పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మేడుదుల దేవయ్య(70)అనే వ్యక్తి తన కూతురు లావణ్య జగ్గారావుపల్లిలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లుకు స్లాబ్ వేస్తున్నందున కొదురుపాకలో జగ్గారావుపల్లికి చెందిన రాములు, విజయలతో కలిసి ఆటోలో వెళుతు న్నాడు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గ్రామం చెందిన ప్రవీణ్ అనేవ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడడంతో దేవయ్య కాలు తెగిపోగా, విలాసాగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న ప్రయాణిస్తున్న రాములుకు, విజయలతోపాటు బైక్ వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో దేవయ్య మృతిచెందినట్లు తెలిపారు.


నిప్పంటించుకున్న వివాహిత మృతి

కోల్‌సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన శుక్రవారం రాత్రి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పోతనకాలనీకి చెందిన వివాహిత నల్ల స్వప్న(38) చికిత్సపొందుతూ గోదావరిఖని సిమ్స్ జనరల్ ఆసుపత్రిలో శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. మెరుగైన చికిత్సకోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేసుకుంటుం డగా మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి హమాలీ ఆత్మహత్య

ఓదెల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలకుంట గ్రామానికి చెందిన దండు రాజు(47) అనే హమాలీ కార్మికుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన రాజు శుక్రవారం మద్యం మత్తులో గడ్డి మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య దండు రాజేశ్వరి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఏఎస్‌ఐ కిషన్ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



శివాలయంలో గుప్త నిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి పురాతన శివాలయంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం మూడు రోజుల క్రితం తవ్వకాలు జరిపారు. సందరెల్లి గ్రామానికి దూరంగా మానేరు పరివాహక నిర్మానుష్య ప్రాంతంలో ఈ గుడి ఉంది. గర్భగుడిలో లింగం ఎదుట తవ్వకాలు చేపట్టారు. గతంలో కూడా పలువురు ఇక్కడ గుప్త నిధులు ఉన్నాయని భావించి తవ్వకాలు చేపట్టారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని దుండగలు తవ్వకాలు చేపట్టడం ఇక్కడకలకలం రేపుతున్నది. ఆలయ ప్రాంతంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి పురాతన ఆలయాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలో గుర్తుతెలియని వ్యక్తి మర్చిపోయిన మొబైల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు ఆటోడ్రైవర్. మండలంలోని కొత్తురు గ్రామానికి చెందిన మామిడిచందు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం ధర్మారం నుంచి కొత్తూరు వెళ్తుండగా ఆటోలో ఎక్కిన వ్యక్తి మొబైల్ ఫోన్‌ను మర్చిపోయాడు. ఆటోలో ఫోన్ ఉండడాన్ని గమనించిన చందు పోలీస్ స్టేషన్‌కువెళ్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు అందించాడు.



ఎస్ఐకి ఫోన్‌ను అందిస్తున్న చందు

నవోదయ పీటీసీ సమావేశం

చొప్పదండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నవోదయవిద్యాలయ(పీటీసీ) పేరెంట్స్ టీచర్స్ కమిటీసమావేశం శనివారం నిర్వహించారు. 15మందివిద్యార్థుల తల్లిదండ్రులు, ఐదుగురు ఉపాధ్యాయులతో నూతనపీటీసీని ఏర్పాటుచేశారు. విద్యాలయంలో చేపడు తున్న అభివృద్ధిపనులను ఇన్‌చార్జిప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తల్లిదండ్రులకు వివరించారు.

నేత్రదానం

జమ్మికుంట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని దుర్గాకాలనీకి చెందిన వజ్ర కృష్ణమూర్తి(73) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సదాశివ ఫౌండేషన్ జిల్లాఅధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లివెంకటేశ్వర్లు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా అంగీకరించారు. నరహరిఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో నేత్ర సేకరణచేసి హైదరాబాద్‌లోని ఐవీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు.

దొరికిన పుస్తెలతాడు అందజేత



స్రవంతికి పుస్తెలతాడును అందజేస్తున్న సీఐ రామకృష్ణ

జమ్మికుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన పుస్తెలతాడును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి ఇద్దరు యువకులు నిజాయితీ చాటుకున్నారు. మాచనపల్లి గ్రామానికి చెందిన కనవేనా తిరుపతిరెడ్డి, కనవేనా ప్రశాంత్ శనివారం పనిమీద జమ్మికుంటలోని డీజీ స్కూల్ వద్దకు వెళ్తున్నారు. రోడ్డుపై పుస్తెలతాడు కనిపించింది. దీంతో పుస్తెలతాడును తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టౌన్‌సీఐ రామకృష్ణ విచారించి పుస్తెలతాడు ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన నేరెళ్ల స్రవంతిదిగా తెలుసుకొని ఆమెను పిలిపించి అప్పగించారు. పుస్తెలతాడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన తిరుపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిని సీఐ రామకృష్ణ అభినందించారు.

హమాలీల తీరుకు నిరసనగా రైతుల ధర్నా



నర్సింగాపూర్‌లో కరీంనగర్-జమ్మికుంట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

వీణవంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో హమాలీల తీరుకు నిరసనగా రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. స్థానిక హమాలీలు ఎక్కువ డబ్బు కావాలని డిమాండు చేస్తూ వడ్లసంచులను లారీలలో లోడ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని అన్నిగ్రామాల్లో వడ్లను సంచుల్లో నింపి కుట్టి కాంటాపెట్టి లారీలో లోడ్‌చేస్తే క్వింటాలుకు 55రూపాయలు తీసుకుంటుంటే నర్సింగాపూర్ హమాలీలు మాత్రం ధాన్యం నింపకుండా సంచులు కుట్టకుండా కేవలం కాంటా వేసినందుకు బస్తాకు 55రూపాయలు డిమాండు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగు రోజులపాటు కాంటాలు నిలిచిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో యూపీకూలీలను తీసుకువచ్చి కాంటాలు వేయిస్తే వారిని స్థానికహమాలీలు అడ్డుకున్నారు. దీంతో రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. యూపీ కూలీలు క్వింటాలుకు 55చొప్పున తీసుకుంటున్నారని స్థానిక హమాలీలు బస్తాల చొప్పున తీసుకొని ప్రత్యేకంగా మాముళ్లు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్థానిక హమాలీలు ఇతర రాష్ట్రాల కూలీలకు పని ఇవ్వవద్దని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ధాన్యం సంచులలో నింపితేనే పూర్తి స్థాయి డబ్బులు చెల్లిస్తామని లేదంటే ఇతర రాష్ట్రాల కూలీలతో పని చేయించుకుంటామని రైతులు తెలిపారు.. అనంతరం పోలీసులు రైతుల వద్దకు వచ్చి ధర్నా విరమింపజేశారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల-మెట్‌పల్లి జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుడ్ల శంకర్, మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామానికి చెందిన గందం రాజేష్ ద్విచక్ర వాహనాలపై పట్టణ శివారులోని హెచ్‌పి పెట్రోల్‌బంక్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారి బంధువులకు, పోలీసులకు సమచారం అందించారు. కాగా శంకర్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాదుకు వారి బంధువులు తరలించంగా రాజేష్‌ను జగిత్యాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

వేములవాడ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి సుహాసినులతో కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. ఈ సందర్భంగా సుహాసినులకు వాయనం అందజేశారు. ఆలయంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

● ఎన్టీఆర్ స్టేడియంలో రాజన్న కల్యాణం..

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఓచానల్ నిర్వహిస్తున్న కోటీ దీపోత్సవంలో భాగంగా శనివారం రాత్రి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి కల్యాణం అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవారలకు సీఎంరేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పిం చారు. ఆలయ ఈవో రమాదేవి, ఆలయ వేదపండితులు పాల్గొన్నారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేరస్తులు నేర ప్రవృత్తిని మాని సత్ప్రవర్తనతో మెలగాలని మంథని సీఐ రాజు అన్నారు. శనివారం ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పాతనేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పలు కేసుల్లో నేరస్తులుగా ఉన్న వారు మళ్లీ నేరాలు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఒక వేళ మళ్లీ పాత పంథాను ఎంచుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాత నేరస్తులపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. కుటుంబాల సంక్షేమం కోసం నేరప్రవృత్తిని మార్చుకొని సంఘంలో హుందాగా జీవించాలని అన్నారు. ఆయన వెంట సీఐ రవికుమార్ తదితరులు ఉన్నారు.



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ

దేశం గర్వించే స్థాయిలో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సంజీవ్

మానకొండూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో దేశం గర్వించే స్థాయిలో రాణించాలని స్థానిక సీఐ బి.సంజీవ్ అన్నారు. మానకొండూర్‌లోని గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న 11వ గురుకులాల జనల్ స్థాయి క్రీడలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. సిరిసిల్ల జోనల్ అధికారి ప్రత్యూష, ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, లచ్చయ్య, పీఈడీ జగదీశ్వర్, పీఈటీలు శేఖర్, శివప్రసాద్, భగత్, గోపి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు పోచంపల్లి విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మశ్రీ

మానకొండూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 7న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన కిరణ్మయి, భార్గవి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను శనివారం ప్రిన్సిపాల్ పద్మశ్రీ అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల విద్యార్థులు

మల్యాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పాఠశా లల యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహిం చిన అండర్-14, అండర్-17 విభాగాల యోగా పోటీలలో కమిలిని, హర్షిణి, హిరన్మయి ప్రతిభ చాటారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్నుట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు.

తుది దశకు కూల్చివేతలు



కూల్చివేతల తర్వాత వేములవాడ రాజన్న ఆలయం

- మారుతున్న రాజన్న ఆలయ రూపురేఖలు
- రెండో విడతలో ఈవో నివాసం, వీవీఐపీ గెస్ట్ హౌస్
- అభివృద్ధి విస్తరణ పనుల కోసం రక్షణ వలయం

వేములవాడ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనుల కూల్చివేతలు తుదిదశకు చేరాయి. దీంతో ఆలయంలో రూపురేఖలు మారిపోతున్నాయి. రాజన్న సన్నిధిలో అభివృద్ధి పనుల విస్తరణ కోసం రూ. 76కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో భక్తుల దర్శ నానికి ఇరుకుగా ఉన్న దేవాలయాన్ని విస్తరించను న్నారు. మరో రూ. 35కోట్లతో అన్నదాన సత్రాన్ని నిర్మించ డానికి సిద్ధం చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతారు. రాజన్న సన్నిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇంతకు ముందు ఉన్న పాత భవనాలను కూల్చి వేశారు. ఇప్పటివరకు ఆలయ ఈవో పరిపాలన కార్యాలయం, కళాభవన్, లడ్డు తయారీ కేంద్రం, క్యూ లైన్‌లు తదితర వాటిని కూల్చివేశారు. ఆలయ ఉత్తరం వైపు గోపురం పక్కనుంచి మిషన్ వెళ్లేం దుకు వీలుగా ప్రాకారం తొలగించారు. ఓపెన్ స్లాబ్ తొలగించే పనులు సాగుతున్నాయి. ఆలయ అంతర్భగంలోనూ క్యూలైన్‌లన్నీ తొలగించారు. కేవలం తూర్పు రాజగోపురం నుంచి భక్తులకు లోనికి అనుమతిస్తూ లఘు దర్శనం కల్పిస్తున్నారు. రెండవ విడుత అభివృద్ధి పనుల సమయంలో ఈవో నివాస భవనం, వివిఐపి గెస్ట్ హౌస్ కూల్చివేయనున్నారు. రాజన్న సన్నిధిలో 4 ఎకరాలకు పైగా జరిగే విస్తరణ పనులు చేపట్ట డానికి తూర్పు, పశ్చిమం వైపున ఎత్తైన రేకులతో రక్షణ వలయాన్ని ఏర్పరిచారు. ఈ వైపుల భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాకపోకలను నిలిపివేశారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు

- రాజేష్, ఈఈ , వేములవాడ దేవస్థానం

భీమేశ్వరాలయంలో ఆర్జిత పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాం. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు వీలుగా తూర్పువైపున క్యూలైన్ ఏర్పాటు చేశాం. శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కుల చెల్లింపు, దర్శనం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

భీమన్న సన్నిధిలో రూ. 3.60కోట్లతో అభివృద్ధి పనులు

శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం రూ. 3.60కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయి. రాజన్న సన్నిధిలో మొన్నటివరకు ఉన్న ఆర్జిత పూజలను భీమేశ్వరాలయానికి మార్చడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో ప్రధానంగా రూ. 50లక్షలతో ప్రసాదం కౌంటర్స్, శంకరమఠ్‌లో రూ. 50లక్షలతో నిత్య కళ్యాణమండపం, రూ. 42లక్షలతో కోడెల క్యూలైన్, రూ.35లక్షలతో దక్షణం, పశ్చమంలో షెడ్, నవగ్రహ మండపం వైపు రూ. 41 లక్షలతో షెడ్, నటరాజ్ విగ్రహం వద్ద క్యూలైన్ షెడ్, రూ. 50లక్షలతో దేవాలయం చుట్టూ షెడ్, రూ. 27లక్షలతో సీసీ ఫ్లోరింగ్, ప్రాకార వాల్ నిర్మాణం, రూ. 16లక్షలతో వంతెనలు ఇతర అభివృద్ధి పనులు దాదాపు పూర్తికావచ్చాయి.



ఆలయ ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రక్షణ వలయం

కూల్చిన మైసమ్మ ఆలయాలను 48 గంటల్లో నిర్మించాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కూల్చిన 46 దారి మైసమ్మ ఆలయాలను 48 గంటల్లోగా నిర్మించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీలతో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడారు. హిందూ ఆలయాలంటే చులకన ఎందుకని, రోడ్డుకు అడ్డంగా ఉన్న మసీదులను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. 48 గంటలు టైమిస్తున్నా.. కూల్చివేసిన మైసమ్మ ఆలయాలను నిర్మించాలన్నారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగియగానే గోదావరిఖని వస్తానన్నారు. ఆటో డ్రైవర్లు అడ్డాల వద్ద ప్రతి రోజూ మైసమ్మకు మొక్కుకుంటారన్నారు. 48 గంటల్లోగా మైసమ్మ ఆలయాలను నిర్మించాలని, లేక పోతే దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చి వేయాలన్నారు. లేకపోతే గోదావరిఖనికి వచ్చి దగ్గరుండి మసీదులన్నింటిని కూల్చి వేయిస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా అధికారులందరినీ ప్రజల ముందు నిలబెడతామన్నారు. జరగబోయే పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తదుపరి కార్యాచరణపై పెద్దపల్లి జిల్లా నాయకులతో పాటు, రాష్ట్ర నాయకులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

- అండర్ 14 ఓవరాల్ చాంపియన్ 'మంథని'

ములుగు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల డీసీవోలు భిక్షపతి, యాదగిరి హాజరయ్యారు. జాకారం గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో మొత్తం 935 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14 ఓవరాల్ చాంపియన్‌గా మంథని నిలిచినట్లు వివరించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.43టీఎంసీల నీరు ఉంది. 100క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ఏరియా ద్వారా వస్తుండగా, సర్‌ప్లస్ గేట్ల ద్వారా 100క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు



భీమేశ్వరాలయం

వేములవాడ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరాలయం విస్తరణ పనుల నేపథ్యంలో ఆర్జిత సేవలను భీమేశ్వరాలయానికి మార్చారు. రాజన్న సన్నిధిలో లఘు దర్శన సౌకర్యం కల్పిస్తూ భీమేశ్వరాలయంలో భక్తులు ఆర్జిత పూజలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. భీమన్న సన్నిధిలోనూ రాజన్న ఆర్జిత సేవల టికెట్ ధరలే అమలు చేస్తున్నారు. అంతకుముందు భీమేశ్వరాలయంలో అమలయ్యే పూజల టికెట్ ధరలకు తేడాలు ఉన్నాయి. ప్రధాన ఆలయమైన రాజన్న సన్నిధిలో ఆర్జిత సేవల టికెట్ ధరలకు, అనుబంధ ఆలయాల్లో జరిగే పూజల టికెట్ ధరలకు వ్యత్యాసం ఉంది. రాజన్న సన్నిధిలో జరిగే ఆర్జిత సేవలతో పాటు కోడెల మొక్కులు భీమేశ్వరలయంలోనే కొనసాగుతున్నాయి. అక్టోబరు 10న పార్వతీరాజరాజేశ్వరస్వామివారి ఉత్సవ మూర్తులను భీమేశ్వరాలయానికి తీసుకొచ్చారు. దీంతో రాజన్న ఆలయంలో జరిగే ఆర్జిత సేవలన్నీ భీమన్న ఆలయానికి మారాయి. అంతకు ముందు భీమన్న గర్భాలయంలో అభిషేక టికెట్ ధర రూ.200 మాత్రమే ఉండేది. ఇపుడు రాజన్న సన్నిధిలో అమలైన అభిషేకం టికెట్ ధర రూ. 1000లు భీమన్న సన్నిధిలో చెల్లించాల్సిందే. ఇకపోతే రాజన్న ఆర్జిత పూజల టికెట్ ధరలను భీమన్న సన్నిధిలోనూ అమలు చేస్తున్నారు. భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవల టికెట్ ధరలు, నిర్వహించే స్థలం వివరాలు ఇలా ఉన్నాయి.

అర్జిత సేవలు	టికెట్ ధర	సమయం	పూజ స్థలం
స్వామివారి అభిషేకం	రూ. 1000	ఉదయం 6-30-10.30	భీమేశ్వర గర్భాలయం
స్వామివారి అన్నపూజ	రూ. 1000	మధ్యాహ్నం 1.30-3.00	భీమేశ్వర గర్భాలయం
స్వామివారి ఆకులపూజ	రూ. 600	రాత్రి 7.00-8.30	భీమేశ్వర గర్భాలయం
కుంకుమ పూజ	రూ. 300	ఉ:7.00- రాత్రి 8.30	శంకరమఠం
స్వామివారి నిత్యకల్యాణం	రూ.1500	ఉదయం 10.30-12.30	అన్నదానసత్రం పైఅంతస్తులో
సత్యనారాయణ వ్రతం	రూ. 600	మధ్యాహ్నం 1.00	అన్నదానసత్రం పైఅంతస్థులో
లింగార్చన	రూ. 1000	సాయంత్రం 6.00	అన్నదానసత్రం పైఅంతస్థులో
కోడె మొక్కులు	రూ. 200	------	భీమేశ్వరాలయం
స్పెషల్ కోడె మొక్కులు	రూ. 500	------	భీమేశ్వరాలయం
నిజ కోడె	రూ. 1,116	-----	భీమేశ్వరాలయం
గండా దీపం	రూ. 5	-----	భీమేశ్వరాలయం
వాహన పూజ (4వీలర్స్)	రూ. 400	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
వాహన పూజ (3వీలర్స్)	రూ. 250	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
వాహన పూజ (2వీలర్స్)	రూ. 100	ఉ: 7.00 -రాత్రి 7.00	వాహనాల చెక్‌పోస్టు
కేశఖండనం	రూ. 50	-------	ప్రధానం చెక్‌పోస్టు వద్దగల షెడ్

నా భర్తను ఇంటికి రప్పించండి

- ప్రవాసీ ప్రజావాణిలో బతికెపల్లి మహిళ వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తున్న అనిత

పెగడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన గడ్డపై ఉపాధి కరువై పరాయి దేశం వెళ్లి అక్కడ కూడా పని దొరకక అక్కడే ఇరుక్కుపోయిన తన భర్తను ఇంటికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ శనివారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన బెక్కం శ్రీను ఉపాధి కోసం 2019లో లేబర్ వీసా మీద సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో చేరగా సరిగా జీతం ఇవ్వకపోవడంతో కంపెనీ నుంచి బయటకు వెళ్లి అక్కడే ఇరుక్కుపోయాడు. అక్కడ ఉపాధి లేక చేతిలో డబ్బులు లేక నానా కష్టాలు పడుతున్నాడని ఇంటి వద్ద నుంచే డబ్బులు పంపిస్తున్నామని తెలిపారు. తన భర్తను ఇండియాకు రప్పించాలని పిల్లలతో కలసి శ్రీను భార్య అనిత ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.

సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలి



కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న నర్సింహారావు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీనియర్ సిటిజన్స్ హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి సీనియర్ సిటిజన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో 10వ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 46మంది సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా 5వ సారి అశోక్‌కుమార్‌తో పాటు, పూర్వ కార్యవర్గం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్యనారాయణ చౌదరి, కోశాధికారి తోట జ్ఞానేశ్వర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జీఆర్ దేశాయి, జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలకల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ కోర్టులో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందెల్లి మహిపాల్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఆరు బాలికల జట్లు, 14 బాలుర జట్లు పాల్గొనగా విజేతలకు ఐవీవై స్కూల్ డైరెక్టర్ జయ మహేష్ బహుమతులను ప్రదానం చేశారు. బెస్ట్ ప్లేయర్ అవార్డులను ఎల్‌పి రాజు, ఏడీఈ ఎం సుధీర్‌కుమార్ ప్రదానం చేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. క్రీడాకారులు ఐస్వేర్ బాస్కెట్‌బాల్ అకాడమీ బాధ్యులు భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు అజీముల్లాఖన్, తేజస్ డిఫెన్స్ అకాడమీ చీటి సతీష్‌రావు, ఫాదర్ సంతోష్ రెడ్డి, సెయింట్ అల్ఫోన్స్ హెచ్‌ఎం అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీటి కార్తీక్, పెటా అధ్యక్షులు శ్రీధర్, పోటీల నిర్వాహకులు జి శ్రీధర్‌రావు, బి జీవన్ కుమార్, డి సత్యానందం, సునీల్‌కుమార్, పి భార్గవ్, జగదీష్, బాలచంద్రన్, వినీల్‌కుమార్ ఉన్నారు.

బీడీ కార్మిక జాతీయ సభలు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20, 30వ తేదీలలో వేమలవాడ పట్టణంలో నిర్వహించే ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సుతారి రాములు కోరారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించి జాతీయ సభల కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుతారి రాములు మాట్లాడారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న జాతీయ సభలను విజయవంతం చేయాలని కొరారు. సమావేశంలో బీడీ కార్మిక సంఘ నాయకులు మౌళనా, కొక్కుల శాంత, ఎన్నం రాధ, హన్మంత్, వెన్న మహేష్, కిరణ్, దేవదాస్, మక్రం, ఆలీ, అందె వంశీకృష్ణ ఉన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

సుల్తానాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి జట్టు కైవసం చేసుకుంది. వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను మెట్‌పల్లికి చెందిన అరుణ్ దక్కించుకున్నాడు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా, ఖోఖో పోటీల్లో బూరుగుపల్లి జట్టు , కబడ్డీలో మెట్‌పల్లి జట్టు, వాలీబాల్‌లో కొత్తపల్లి జట్టు విజేతగా నిలిచింది. అథ్లెటిక్స్‌లో వంద మీటర్ల పరుగు పందెంలో విజయకృష్ణ, 200 మీటర్ల పోటీల్లో ప్రణీత్, 400 మీటర్లలో అభినవ్, 800 మీటర్లలో అక్షయ్, 1500 మీటర్ల పరుగు పందెంలో శశికుమర్‌లు విజేతలుగా నిలిచారు. హైజంప్‌లో మెట్‌పల్లికి చెందిన అరుణ్ ప్రథమ, గన్నేరువరంకు చెందిన హర్షవర్ధన్ ద్వితీయ, సిరిసిల్లకు చెందిన ధనుష్ తృతీయ స్థానం సాధించారు. అలాగే లాంగ్‌జంప్‌లో అరుణ్ ప్రథమ, విగ్నేష్ ద్వితీయ, అభిరామ్ తృతీయ స్థానాలు పొందారు. డిస్క్‌త్రోలో సుల్తానాబాద్‌కు చెందిన రాజ్ కుమార్, షాట్‌పుట్‌లో సింగరాయపేటకు చెందిన నిఖిల్ ప్రథమ, కొత్తపల్లికి చెందిన నిరంకార్ ద్వితీయ, బీర్పూర్‌కు చెందిన శ్రీకర్ తృతీయ స్థానంలో నిలిచారు.

18వ రోజు గోదావరి హారతి



గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి 18 వ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. మహిళలు డొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావుఉన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన కార్తీక భక్తుల రద్దీ



ధర్మపురిలో స్వామివారలను దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో మూడవ శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేక మంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్దలతో పూజించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

● సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శనివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక నిర్వహించారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ జెండాలపై నిర్లక్ష్యం

పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాత మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని మరోచోటకు మార్చారు. ఈ క్రమంలో అందులో ఉన్న జాతీయ జెండాలు కార్యాలయంలో గదిలోనే నేలపై పడేసి వెళ్లిపోయారు. జాతీయ జెండాలను పవిత్రంగా ఉంచాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టనట్లుగా పడేయడంతో అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఓపెన్ బ్రిడ్జి చాంపియన్ షిప్ టోర్నమెంట్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో శనివారం ఓపెన్ బ్రిడ్జి టోర్నమెంట్‌ను ఆర్డీవో గంగయ్య ప్రారంభించారు. పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33వ ఓపెన్ బ్రిడ్జి చాంపియన్ షిప్ టోర్నమెంట్‌ను ప్రారంభించి పాల్గొన్న వారికి అభినందలు తెలిపారు. ఉపాధ్యక్షుడు జనార్దన్ రావు, జనరల్ సెక్రటరీ కొట్టే సదానందం, డైరెక్టర్ అక్కపాక తిరుపతి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పంటల పరిశీలనలో ఊషన్నపల్లి విద్యార్థులు


పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య విద్యార్థులను పంట పొలాల వద్దకు తీసుకెళ్లారు. పంటల పెరుగుదల, సస్యరక్షణ, చీడపీడలపై వివరించారు. పత్తి, పసుపు, వరి, పామాయిల్ పంటలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పంటలపై విద్యార్థులతో మాట్లాడించారు. పాఠశాలలో చదువుతోపాటు విద్యార్థులకు దగ్గరలోని వనరులను సద్వినియోగం చేసేలా వారికి క్షేత్రస్థాయికి తీసుకెళ్లి పరిజ్ఞానం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల పనిదినాల్లో కాకుండా సెలవుల్లో వీరిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లితే చదువుతోపాటు విజ్ఞానం అందించిన వారమవుతామన్నారు.

15 నుంచి మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె


మాట్లాడుతున్న పూసల రమేష్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు ప్రభుత్వం తీర్చకుంటే ఈ నెల 15 నుంచి సమ్మె చేస్తామని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన వర్కర్లతో ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల వర్కర్లు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఏడు నెలలుగా కోడిగుడ్ల బిల్లులు రావడం లేదన్నారు. గౌరవ వేతనం నాలుగు నెలలుగా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అంగన్‌వాడీకి ఎలాగైతే సరుకులు, గ్యాస్, నిత్యావసరాలు అందిస్తుందో తమకు కూడా అలాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14లోగా ప్రభుత్వం సమస్య పరిష్కరించకుంటే 15 నుంచి సమ్మెలో పాల్గొంటామన్నారు. మండల అధ్యక్షుడు జక్కుల రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి లావణ్య, దర్శనాల పోచమ్మ, ఓరం సరూప పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలి


నియామక పత్రాన్ని ఏజీఎం హెచ్ఆర్‌కు అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని ఏజీఎం హెచ్ఆర్‌కు ఆర్ఐడబ్ల్యూయు సీఐటీయూ కమిటీ వినతిపత్రం అందించారు. ఎన్టీపీసీలో సీఐటీయూ కార్యాలయంలో 12వ మహాసభలు జరిగాయి. ఇందులో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, అధ్యక్షుడిగా యాకూబ్, ప్రధాన కార్యదర్శిగా గీట్ల లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా నాంసాని శంకర్, రామాచారి, దండ రాఘవరెడ్డి, కాదాసి మల్లేష్, కుందారపు రాజ్ కుమార్, పురుషోత్తం, కార్యదర్శులుగా షమీం, తోట రవీందర్, అర్జున్, అశోక్, కోశాధికారిగా ఆడేపు రమేష్‌లతోపాటు మరో 18 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పలువురు ఏజీఎం బిజయ్ కుమార్ సిగ్దర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో కమిటీకి సహకారం అందించాలని వారు కోరారు.

స్థానికులకే షట్టర్లు అద్దెకు ఇవ్వాలి


వినతిపత్రం ఇస్తున్న మార్వాడీ గోబ్యాక్ జేఏసీ సభ్యులు

పెద్దపల్లిటౌన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపార సముదాయాలు, వ్యక్తిగత గదులను స్థానికులకే అద్దెకు ఇవ్వాలని భవన ఓనర్లను మార్వాడీ గో బ్యాక్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ, జిల్లా కన్వీనర్ పోలం సతీష్ యాదవ్, కో కన్వీనర్ కళ్ళేపల్లి రవి కోరారు. శనివారం పెద్దపల్లి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మాదూరి వినోద్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. పెద్దపల్లిలో మార్వాడీలకు ఇచ్చిన గదులను వాపస్ తీసుకుని స్థానికులకు ఇవ్వాలని కోరారు. తమ పోరాటానికి మద్దతు ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గద్దల వినయ్ కుమార్, బొడ్డుపల్లి రాంమూర్తి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలు

ముత్తారం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో మండలంలోని దరియాపూర్ మోడల్ స్కూల్ బెస్ట్ టీం కప్ అందుకున్నది. కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో స్కూల్‌కు చెందిన విద్యార్థులు కటాస్ విభాగంలో 30 మంది పాల్గొనగా ఏడుగురికి స్వర్ణం, రజితం 8, కాంస్య 15 మంది విద్యార్థులు సాధించారు. బెస్ట్ టీమ్ కప్‌ను కరాటే ట్రైనర్ శివానీ, ప్రిన్సిపాల్ కేసరి సంతోష్‌కుమార్ ఉన్నారు.


విద్యార్థికి కప్ అందజేస్తున్న సినీ ప్రముఖులు సుమన్

అడిషనల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

కళ్యాణ్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో గుళ్లను కూల్చి వేసిన అడిషనల్ కలెక్టర్, రామగుండం కమిషనర్ అరుణశ్రీని సస్పెండ్ చేయాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, కో ఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేషన్‌లో 46మైసమ్మ గుళ్లను కూల్చివేశారని, దీనికి మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలని, సీసీ పుటేజీలను పరిశీలించి కూల్చివేతలో భాగస్వామ్యం అయిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌పై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, కోమళ్ల మహేష్, సుల్వ లక్ష్మీనర్సయ్య, జక్కుల నరహరి, కోడూరి రమేష్, గుండబోయిన అపర్ణ, హరీష్, పవన్ పాల్గొన్నారు.

మరో నాలుగు గొర్రెల మృతి

ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లి గ్రామంలో విషాహారం తిన్న గొర్రెల మృత్యువాత కొనసాగుతుంది. శుక్రవారం వరకు 36 గొర్రెలు చనిపోగా రెండు వందల గొర్రెలకు వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. శనివారం మరో నాలుగు మూగ జీవులు మృత్యువాత పడగా చనిపోయిన వాటి సంఖ్య 40 చేరింది. శనివారం మరో 20 నుంచి 30 గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గొర్రెల మృత్యువాతతో కుర్మ గొల్లల కుటుంబాలకు 4 నుంచి 5 లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. గొర్రెలు చనిపోయిన కుర్మ గొల్లల కుటుంబాలను మేడారం ప్యాక్స్ చైర్మెన్ ముత్యాల బలరాంరెడ్డి పరామర్శించారు.

కుర్మ గొల్లల కుటుంబాలను ఆదుకోవాలి

--అప్పాల శ్రీనివాస్

విషాహారం తిని గొర్రెల మృత్యువాతతో కుటుంబాలకు తీవ్ర నష్టం జరిగింది. మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని నష్ట పరిహారం ఇప్పించి వారిని ఆదుకోవాలి.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు


రీజినల్ కోఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సుల్తానాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూపతిపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అంజలి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్ఐ అశోక్ రెడ్డి, డీడీ డబ్ల్యు సంధ్యారాణి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన రీజినల్ కోఆర్డినేటర్ అంజలిని పలువురు ప్రిన్సిపాళ్ల, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ నెల 11 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14 క్రీడా పోటీలు ఉంటాయని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలి

సుల్తానాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని సహకార సంఘం సీఈఓ బూరుగు సంతోష్ రైతులకు సూచించారు. శనివారం ఆయన విలేకరులకు ఆయిల్‌పామ్ సాగు వివరాలు వెల్లడించారు. సహకార సంఘం పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సంఘానికి వంద ఎకరాల లక్ష్యాన్ని కలెక్టర్ విధించారన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు సంఘ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి, అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్‌లు మాదిరెడ్డి నరసింహారెడ్డి, చింతపండు సంపత్‌లు అన్నారు. శనివారం మారేడుగొండ, గుర్రాంపల్లి, మూలసాల, నిట్టూరు, నిమ్మనపల్లి, పాలితం, కాసులపల్లి, గోపయ్యపల్లి, కాపులపల్లి, కనగర్తి, రాగినేడు, బ్రాహ్మణపల్లి, రాఘవపూర్ గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. సీఈవో మధు, వైస్ చైర్మన్ ఆంజనేయరావు, మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ మల్లారెడ్డి, మల్లయ్య, డైరెక్టర్‌లు సీఈఓ రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో హెచ్‌టీఆర్ వైఫల్యంపై కేంద్రం సీరియస్

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం దేశంలోని పలు మూతపడిన ఎరువుల కర్మాగారాలను వివిధ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్యంతో ఐదు పరిశ్రమలను పునరుద్ధరించింది. రామగుండంలో రామగుండం ఫెర్టిలైజర్స్ పేర నెలకొల్పారు. ఈ ఐదు పరిశ్రమల్లో రామగుండంలో మాత్రమే హల్దర్ టాప్స్ టెక్నాలజీతో పరిశ్రమను పునరుద్ధరించారు. ఇక్కడ మాత్రమే హెచ్‌టీఆర్ సమస్య ఏర్పడడంతో కేంద్రం సీరియస్‌గా తీసుకుంది.

మరమ్మతులకు హల్దర్ టాప్స్ సానుకూలత

కేంద్రం ఒత్తిడితో ఆర్ఎఫ్‌సీఎల్‌కు టెక్నాలజీ సరఫరా చేసి హల్దర్ టాప్స్ సంస్థ దిగివచ్చినట్టు తెలుస్తుంది. కీలకమైన హెచ్‌టీఆర్‌ను మరమ్మతు చేసేందుకు సానుకూత వ్యక్తం చేసినట్టు సమాచారం. వారంటీ విషయంలో ఎరువుల రసాయనాల శాఖకు హల్దర్ టాప్స్‌కు మధ్య చర్చలు జరుగుతు న్నట్టు తెలుస్తుంది. కొత్త హెచ్‌టీఆర్ కొనుగోలు చేయాలంటే రూ.150 నుంచి రూ.200కోట్లు అవసరం ఉంటాయి. మరమ్మతులకు రూ.40కోట్ల వరకు నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. హెచ్‌టీఆర్‌ను రామ గుండం నుంచి డెన్మార్క్‌కు తీసుకెళ్లి అక్కడ మరమ్మతులు చేసి మళ్లీ తీసుకువచ్చి బిగించాల్సి ఉంటుంది. దీనికి ఏడాది కాలం పట్టే అవకాశం ఉంది.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లిలో నిర్వహిస్తున్న లక్ష్మీ నృసింహస్వామి జాతరలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ డీఈ తిరుపతి అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికను ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట విద్యుత్ శాఖ ఏఈ రవిచంద్ర, విద్యుత్ శాఖ సిబ్బంది స్వామి ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

జూలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాచాపూర్‌లో సీఐటీయూ మండల సమావేశం శనివారం జరిగింది. కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 15,16 తేదీలలో పెద్దపల్లి ఎంబి గార్డెన్‌లో నిర్వహించే మహాసభలకు కార్మికులు తరలిరావాలని తీర్మానించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. వేల్పుల బాస్కర్, సూర్యానందం, మాంకాలి అంజయ్య, నాగేశ్వర్ పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ ఫార్చ్యున్ మెడికేర్ ఆసుపత్రి సౌజన్యంతో 217 మంది కార్మికులకు బీపీ, షుగర్, ఇసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేసినట్లు క్యాంపు ఇంచార్జి గజవెల్లి గణేష్ తెలిపారు. సేల్స్ ఆఫీసర్ నాగరాజు, నేత్ర వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎం, ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


జెండా చౌరస్తాలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. పెద్దపల్లి జెండా వద్ద మస్రత్, బూతగడ్డ సంపత్ ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానం చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప సురేందర్ ఆధ్వర్యంలో స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మండల యువజన అధ్యక్షుడు జడల రాజు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కళబోయిన మహేందర్, మండల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భూషణవేన సురేష్ గౌడ్, సందనవేణ రాజేందర్ యాదవ్, కోట శ్రీనివాస్ గౌడ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, జగదీష్,పొగల శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతోపాటు కనగర్తి, కొలనూర్, గోపరపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, ఆలయ చైర్మన్ మొండయ్య ఆధ్వర్యంలో అర్చన నిర్వహించారు. కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు బీసీ బాలుర హాస్టల్, బాలికల వసతిగృహంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, బైరి రవి గౌడ్, పాల్గొన్నారు.

ఎలిగేడు,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మండిగ రేణుక రాజనర్సు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు జన్మదిన వేడుకలు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, దేవేందర్ రావు, మాదాసి సతీష్, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. సంజీవని నర్సింగ్‌హోంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాలకుర్తి రాజేశం, దేవి జనార్ధన్, కాడె సూర్యనారాయణ, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, గంధం మహిపాల్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే విజయ రమణారావు జన్మదినం పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్య గౌడ్, మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని గోదావరిఖనిలో నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు జన్మదిన వేడుకలను పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, మార్కెట్ వైస్‌చైర్మెన్ కొమ్మ పోచాలు, విండో చైర్మన్ వేణుగోపాల్‌రావు, నాయకులు లోక జలపతిరెడ్డి, శ్రీనివాస్, తొంటి మధూకర్, కొత్త రవిందర్, రాగల్ల రవి, కందుకూరి అంజయ్య, లింగయ్యగౌడ్, కోరెపు సంపత్, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు జన్మదినం కొత్తపల్లి, పెద్దకల్వల, కాపులపల్లిలో నిర్వహించారు. మల్లయ్య, శ్రీనివాస్, చొక్కయ్య, మహేందర్, సంతోష్ యాదవ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం నిర్వహించారు. మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, జక్కుల దామోదర్‌రావు, చాట్ల సదానందం, మార్క రాజు, కేశవులు, పాల్గొన్నారు.


జూలపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మండల పంచాయతీ అధికారిగా మౌనిక

రామగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ అధికారిగా మౌనిక బాధ్యతలు చేపట్టారు. గ్రామాల్లో పరిపాలన పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎలిగేడులో కార్తీక మాస సందడి

ఎలిగేడు, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవాని రామలింగేశ్వర ఆలయంలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకం, అన్నపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే భోళా శంకరునిగా దేవాలయానికి ప్రత్యేకత ఉందని అర్చ కులు సేగ్యామ దయాకర్ శర్మ అన్నారు. కేశెట్టి కాశీనా థం పద్మలత, దొంతుల మేఘశ్యాం రాజ్యలక్ష్మి, రాచమల్ల రమేష్ విజయ, కేశెట్టి చంద్రశేఖర్ అనూష, మణికంఠ శిరీష దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంథని మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. సంకట హర చతు ర్థిని పురస్కరించుకొని మహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలం కరించారు. ఆలయ ఆవరణ సందడి గా మారింది.

ఎంఫార్మసీ విద్యార్థినికి బంగారు పతకం

రామగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీకి చెందిన కదార కళాధర్‌రెడ్డి అరుణ కూతురు హస్య రెడ్డి శాతవాహన యూనివర్సిటీలో ఎంఫార్మసీలో అత్యు త్తమ ఫలితాన్ని సాధించి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, వైస్ చాన్సలర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకొంది. తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల నాయకులు నూనెరాజేశం, పోతుజ్యోతిరెడ్డి, శ్రీనివాస చారి, శంకర్, వనం శేషగిరిరావు, ఆరెందల ప్రకాశ్, లక్ష్మీనారాయణ విద్యార్థిని శాలువతో సన్మానించారు.



డిమాండ్లు పరిష్కరించాలని ఏఐటీయూసీ ధర్నా


ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ శ్రేణులు ధర్నా చేశాయి. మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి పాత విధానంలో ఇన్వాలిడేషన్ ఇవ్వాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక పత్రాలను అందజేయాలని, పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని, డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, క్రమశిక్షణ చర్యల పేరిట 150 మస్టర్లు చేయాలని జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎల్ ప్రకాష్, రవీందర్, అన్నారావు, శ్యాంసన్, రవికుమార్, బుర్ర తిరుపతి, తాళ్ళపల్లి నారాయణ, రవికుమార్, మహేందర్, రాజు, రాజసాగర్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి) ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయం ఎదుట డిమాండ్ పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మెడికల్‌బోర్డు, సొంతింటి పథకం, అలవెన్స్‌పై పెర్క్స్, మారుపేర్లు, డిస్మిస్ కార్మికుల సమస్య పరిష్కారం తదితర ప్రధాన డిమాండ్‌ల పై జీఎం కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వినతి పత్రం అందజేశారు. వై.వీరావు, ఎంఆర్‌సి రెడ్డి, బండారి క్రాంతి, రమేష్, సంపత్, సురేష్, గంగాధర్, బాస్కర్‌రాజు, లక్ష్మణ్, కొమురయ్య పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్యలను పరిష్కరించండి...

గోదావరిఖని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మారుపేర్ల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అతీ గతి లేదని మారుపేర్ల సంఘం నాయకులు లక్కం శ్రావణ్‌గౌడ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం మా జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. 11న జరిగే జేసీసీ సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు మారుపేర్ల సమస్య పరిష్కారం కోసం డిమాండ్ చేయాలని కోరారు. 14న జరిగే మంత్రివర్గ సమావేశంలో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈర్ల రాజయ్య, డిష్‌బాబు, హరీష్, ప్రకాష్, ప్రవీణ్, శ్రీనివాస్, రవి కుమార్, రాయమల్లు పాల్గొన్నారు.


గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రాజెక్టు అధికారి

రామగిరి నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో గైర్హాజరు కార్మికులకు శనివారం కౌన్సెలింగ్ చేపట్టారు. ప్రాజెక్టు అధికారి జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరు విధులకు ఆటంకాలు లేకుండా హాజరు కావాలని సూచించారు. 320 మంది ఉద్యోగులకు 122 మంది హాజరయ్యారు. అధికారులు మధుశ్రీ, సాయికృష్ణ, ఐఎన్‌టీయుసీ నాయకులు గంగాధర్, ఏఐటియుసి పీట్ సెక్రటరీ మల్లేష్, సుమన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారుల డిమాండ్ల పరిష్కారానికి జీఎంకు వినతి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

రామగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో అధికారులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించాలని శనివారం అధికారులు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. అందులో ప్రధానంగా 2007-08 నుంచి 2013-14 వరకు పెండింగ్‌లో ఉన్న హైకోర్టు ఆర్డర్‌లోని పిఆర్‌సి బకాయిలు చెల్లింపు, ఉచిత కరెంట్, అధికారుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రమోషన్స్ పాలసీపై పారదర్శకత అంశాలపై వినతిపత్రాన్ని జీఎంకు అందజేశారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): పీఆర్‌పీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల సంఘం జీఎం వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేసింది. ఉత్పత్తిలో అధికారులే కీలకమని వారికి రావాల్సిన పీఆర్‌పీను చెల్లించకుండా జాప్యం చేయడంతో అధికారుల్లో అసంతృప్తి నెలకొన్నట్టు సీఎంఓఏఐ సభ్యులు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అధికారుల సంఘం ఆర్జీ-2 అధ్యక్షుడు ఎం రాముడు, అధికారులు సుజన్ మెహర్, సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, నెహ్రూ, ఉదయ్ హరిజన్, సురేష్‌బాబు ఉన్నారు.

గైర్హాజరు సర్క్యూలర్‌ను రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇబ్బందికరంగా ఉన్న గైర్హాజరు సర్క్యూలర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై సీఐటీయూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. 150 మస్టర్లు ఉండాలనే నిబంధనతో ఉద్యోగభద్రతకు ముప్పు ఏర్పడనున్నట్టు తెలిపారు. ఈసర్క్యులర్ కార్మికుల జీవితాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. కొత్తగా జారీ చేసిన గైర్హాజర్ సర్క్యులర్‌లోని నిబంధనలు, గైర్హాజరీని లెక్కించే పద్ధతులు, సెలవులు మంజూరు ప్రక్రియ కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నట్టు ప్రవీణ్ తెలిపారు. సంపత్, రాంప్రసాద్, భూమయ్య, సాంబరావు, సారంగం, వినేష్, లక్ష్మీరాజం, నాగరాజు, తిరుపతి, వినయ్ పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు ప్రమాద బీమా వర్తింప జేయండి



గోదావరిఖని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉచిత ప్రమాద బీమా పథకం ఆదర్శంగా నిలిచిం దని సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ఈ పథకాన్ని సింగరేణిలో ప్రారంభించడంలో సహకారం అందించిన బ్యాంకుల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సింగరేణి భవన్‌లో పలు బ్యాంకుల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా సింగరేణి ఉద్యోగులకు గరిష్టంగా రూ.1.25కోట్ల వరకు, పొరుగు సేవల సిబ్బందికి రూ.40లక్షల వరకు బీమా అందించడం సంతోషకరమన్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మరణించిన 34 మందికి దాదాపు రూ.30 కోట్ల బీమా సొమ్మును అందించామన్నారు. అయితే ఒప్పంద కార్మికులకు కనీసం రూ.50లక్షల ప్రమాద బీమా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు సహజ మరణంతో చనిపోతే కనీసం రూ.20లక్షల టర్మ్ ఇన్సురెన్స్ ఇచ్చే విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు సింగరేణి డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు, జీఎం(కో ఆర్డినేషన్) శ్రీనివాస్, ఏజీఎం(ఫైనాన్స్) చక్రవర్తి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.